క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు శేరిలింగంపల్లిలోని బీహెచ్ఈఎల్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా చందానగర్ మెయిన్ రోడ్డు, బీహెచ్ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ఏరియా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీ సంస్థాగత ఇన్‌చార్జ్‌గా గోవర్ధన్‌గౌడ్

● డివిజన్ ఇన్‌చార్జ్‌ల నియామకం

శేరిలింగంపల్లి: బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ సంస్థాగత ఇన్‌చార్జ్‌గా రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింతకింది గోవర్ధన్‌గౌడ్ నియమితులయ్యారు. అదే విధంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల వరకు వివిధ డివిజన్లకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. జిల్లా మేధావుల సెల్ కన్వీనర్‌ను శేరిలింగంపల్లి డివిజన్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.నవతారెడ్డిని చందానగర్ డివిజన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు డిఎస్ఆర్‌కె ప్రసాద్‌ను మియాపూర్‌కు, బీజేపీ రాష్ట్ర నాయకులు మొవ్వా సత్యనారాయణను హఫీజ్‌పేట్‌కు, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిని మాదాపూర్ డివిజన్‌కు, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్‌యాదవ్‌ను కొండాపూర్ డివిజన్‌కు, జిల్లా పార్టీ కార్యదర్శి మూల అనిల్‌కుమార్ గౌడ్‌ను గచ్చిబౌలి డివిజన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు టి.మహిపాల్‌రెడ్డిని ఎంఐజీ కాలనీలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్లు పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి బుధవారం తెలిపారు.

'మనూ'కు గోల్డ్ గార్డెన్ అవార్డు



అవార్డును అందుకుంటున్న ఈఈ నాగేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్, అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్‌లో పచ్చదనానికి ఆలవాలంగా నిలిచిన ఉర్దూ విశ్వవిద్యాలయంకు గోల్డ్ గార్డెన్ అవార్డు లభించింది. ఇటీవల పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ నాగేశ్వరరెడ్డి గోల్డ్ గార్డెన్ అవార్డు, సర్టిఫికెట్‌ను మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు.

పచ్చదనం మరింత పెంచాలి : వీసీ ఐనుల్ హసన్

ఉర్దూ విశ్వవిద్యాలయంలో మరింత పచ్చదనం పెంచాలని వీసీ అధికారులకు సూచించారు. గోల్డ్ గార్డెన్ అవార్డు అందుకున్న ఈఈ నాగేశ్వర్‌రెడ్డి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఇంజనీర్ నాగేశ్వర్‌రెడ్డిను ఆయన అభినందించారు.

క్రీడాకారుల సందడి



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న దివ్యాంగ బాలిక

రాయదుర్గం: గోపన్‌పల్లి జవహర్ నవోదయ విద్యాలయంలో దివ్యాంగ క్రీడాకారుల సందడి నెలకొంది. బుధవారం జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా, ఆదిత్య మెహతా ఫౌండేషన్ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పారా స్పోర్ట్స్ క్రీడాకారుల ఎంపిక కొనసాగింది. నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ, జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ పర్యవేక్షించారు.

అనధికార లావాదేవీలు చేసిన వ్యక్తి పై కేసు



అనిల్‌కుమార్‌రెడ్డి

మాదాపూర్: ఓ వ్యక్తి పేటీఎం ఖాతా నుండి డబ్బులను తన అకౌంట్‌లోకి అనధికారికంగా లావాదేవీలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. కడపకి చెందిన అనిల్‌కుమార్ రెడ్డి ప్రైవేటు ఉద్యోగి. మాదాపూర్‌లో నివాసముంటున్నాడు. వేణుగోపాల్ అనే వ్యక్తికి తెలియకుండా తన పేటీఎం ద్వారా రూ.15000 రూపాయలను తన అకౌంట్‌లోకి బదిలీ చేశాడు. ఫిర్యాదు దారుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని 15 వేల రూపాయలను సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైలైఫ్ హైదరాబాద్ సూచనలతో ఖాళీ స్థలాల అభివృద్ధి

వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య



ఖాళీస్థలాల అభివృద్ధిపై అధికారులతో మాట్లాడుతున్న వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య

గచ్చిబౌలి: జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలను హైలైఫ్ హైదరాబాద్ సూచనలు, సలహాలతో అభివృద్ధి చేస్తామని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య పేర్కొన్నారు. బుధవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, హైలైఫ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ అధీనంలో ఉన్న వంద చదరపు గజాల స్థలం నుంచి రెండు వందల చదరపు గజాల స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో కోటి రూపాయల వ్యయంతో ఖాళీ స్థలాలను అభివృద్ధి చేస్తామన్నారు. నిరుపయోగంగా ఉన్న స్థలాలను వాడుకలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ జాయింట్ కమిషనర్ మల్లారెడ్డి, ఉప కమిషనర్లు వెంకన్న, సుదాంష్, రమేష్, బాలయ్య, ఎస్ఈ, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

గడపగడపకూ బీజేపీ .. కరపత్రాల పంపిణీ



ఖాజాగూడలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

రాయదుర్గం: శేరిలింగంపల్లిలో కాషాయ జెండా ఎగురవేయడమే బీజేపీ లక్ష్యంగా పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖాజాగూడ, వీకర్ సెక్షన్ కాలనీ, వడ్డెరబస్తీలలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీకుల పేరిట విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరుణ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, అనీల్‌కుమార్‌యాదవ్, రవి, లక్ష్మణ్‌ముదిరాజ్, గణేష్‌ముదిరాజ్, అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, సుభిక్షపాలన బీజేపీతోనే సాధ్యం

శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమం, సుభిక్ష పాలన బీజేపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం శేరిలింగంపల్లి డివిజన్ గోపీనగర్ నుంచి భారీ సంఖ్యలో యువకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయనను వారు భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన సూచించారు. గడపగడపకూ బీజేపీకి ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో నామ్‌దేవ్, ప్రసాద్, రాజేష్, హేమంత్, వెంకట్, బన్నీ, మహేష్, ఆకాష్, హేమంత్, అనీల్, గోపనగర్‌వాసులు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, అనీల్‌కుమార్ యాదవ్, పద్మ, అఖిల్, శ్రీకాంత్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోబో సహకారంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్సలో సహకారం అందించే రోబోతో డాక్టర్ రత్నాకర్ రావు

గచ్చిబౌలి: రోబో సహకారంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించారు. మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సకు అధునాతన సాంకేతికత వెలిస్ రోబో అందుబాటులో ఉందని కేర్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ హెచ్ఓడీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ రత్నాకర్ తెలిపారు. రోబో సాయంతో ఖచ్చితమైన కొలతలతో మోకాలి ఎముకలను చెక్కడం, అత్యంత ఖచ్చితమైన ఇంప్లాంట్స్ అమర్చడం వల్ల త్వరగా కోలుకోవచ్చన్నారు. 20 సంవత్సరాలుగా మోకాలి మార్పిడి చికిత్సలో జరిగే ఇబ్బందులను అధిగమించవచ్చని డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు.

కాలనీవాసులతో కార్పొరేటర్ సమావేశం



లక్ష్మీవిహార్ ఫేజ్-2 కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని లక్ష్మీవిహార్ ఫేజ్-2 కాలనీలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించగా పారిశుధ్యం, ఎలక్ట్రికల్, డ్రైనేజీ, జీబీ బార్ అండ్ రెస్టారెంట్‌తో కల్గుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రవీంద్ర ప్రసాద్‌దూబే, నోడల్ ఆఫీసర్ రాజశేఖర్, ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు కరుణాకర్, ప్రతినిధులు నర్సింహారావు, విద్యాసాగర్, రాజు అల్లూరి, రత్నాకర్‌రెడ్డి ,సరిత, మాధవి, నిమ్మగడ్డ రాము తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గాంధీ, సాయిబాబా తదితరులు

దావత్ ఏ ఇఫ్తార్

రాయదుర్గం: రాయదుర్గం మసీదులో బుధవారం దావత్ ఏ ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, నరేష్, సంపత్, శ్రావణ్, సలావుద్దిన్, అక్బర్, కుతుబుద్దీన్, అంజాద్, స్థానికులు పాల్గొన్నారు.

గొల్లకురుమల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. త్వరలో చేపట్టనున్న రెండో విడత గొర్రెల పంపిణీపై బుధవారం పటాన్‌చెరు మండల కేంద్రంలో నియోజకవర్గస్థాయి గొర్రెల పెంపకందార్ల సహకార సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 1509 మంది సభ్యులు సహకార సంఘంలో సభ్యత్వ నమోదు చేసుకున్నారన్నారు. వీరిలో ఇప్పటివరకు 500 మంది మాత్రమే సబ్సిడీ మొత్తాన్ని చెల్లించారని తెలిపారు. ఈనెల 28 లోపు 100శాతం చెల్లింపులు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కార్మికులకు అండగా ఉంటాం..



వర్కర్లకు మద్దతు తెలుపుతున్న కృష్ణ తదితరులు

సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కృష్ణ

శేరిలింగంపల్లి: అపర్ణ సరోవర్‌లో పనిచేసే హౌస్ కీపింగ్ వర్కర్లకు సీఐటీయూ అండగా ఉంటుందని ఆ యూనియన్ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ తెలిపారు. నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో పనిచేసే హౌస్ కీపింగ్ వర్కర్లు వేతనాలు పెంచాలంటూ బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ అపర్ణ సరోవర్‌లో గత నాలుగేళ్లుగా హౌస్ కీపింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న స్కిల్డ్ వర్కర్లకు రూ.15000 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11500 మాత్రమే బీవీజీ కాంట్రాక్టు సంస్థ చెల్లిస్తోందన్నారు. సంస్థ జీఓ ప్రకారం వేతనాలు చెల్లించకుండా వర్కర్లను వేధిస్తోందని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సాయినగర్, సాయిజ్యోతినగర్ కాలనీవాసులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి, విద్యుత్ దీపాల సమస్యలు ఉన్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కార్పొరేటర్ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నాయకులు బూరుగడ్డ నగేష్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

జీహెచ్ఎంసీ కార్యాలయం ఆవరణలో స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్ ఆధ్వర్యంలో వైద్యులు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన వారికి అత్యవసర సమయంలో సీపీఆర్ ఏవిధంగా చేయాలి తదితర అంశాలపై వైద్యులు వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ బాలయ్య, నాయకులు బూరుగడ్డ నగేష్, కుమార్‌గౌడ్, వెన్నవరం మోహన్‌రెడ్డి, యాదయ్య, నర్సింగ్ పాల్గొన్నారు.

కాలనీ కాంటాక్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని కాలనీ, బస్తీల సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని జనప్రియ వెస్ట్ సిటీ, స్టాలిన్‌నగర్, గ్రీన్ వ్యాలీ, మక్తమహబూబ్‌పేట, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, మియాపూర్ విలేజ్, ఫ్రెండ్స్ కాలనీ, పార్వతీనగర్, మయూరినగర్, దోవా కాలనీ, శీలా గార్డెన్స్ కాలనీలలో బుధవారం కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, ఉప కమీషనర్ సుదాంశ్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరై కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి వేదికన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డాక్టర్ కార్తీక్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్, ఏఈ శివప్రసాద్, ఎస్ఐ రవికుమార్, జలమండలి మేనేజర్ సాయి చరిత, ఎస్ఆర్పీ కనకరాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పలు డివిజన్‌లలో పబ్లిక్ కాంటాక్ట్

వినతుల వెల్లువ



కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలు డివిజన్‌లలో బుధవారం పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ, వివేకానంద నగర్, బాలాజీనగర్, హైదర్‌నగర్ డివిజన్‌లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు, జీహెచ్‌యంసీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌లు మాట్లాడుతూ కాలనీల్లో ఉన్న సమస్యలను నేరుగా అధికారులకు వివరించి వెంటనే సమస్య పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్, హెచ్‌యంటి హిల్స్ కాలనీ, తులసినగర్ కాలనీల సమస్యలను వివరించారు. అలాగే బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కై త్లాపూర్, శ్రీరామ్‌నగర్ కాలనీలవాసులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అదే విధంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని గణేష్‌నగర్, తారకరామ్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, మొగులమ్మ కాలనీ, ఖాజా నగర్ కాలనీల్లో సమస్యలను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అధికారులకు విన్నవించారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని మాధవరం కాలనీ ఏ.బి.సి బ్లాకులు, కమలప్రసన్న నగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1 ప్రాంతాల సమస్యలను స్థానికులు స్థానిక కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, అధికారులకు సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేశారు. ఈ సమస్యలను అధికారులు దశల వారీగా పరిష్కరిస్తారని కార్పొరేటర్‌లు తెలిపారు.

21 నుంచి శంకర జయంతి ఉత్సవాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో 6వ ఫేజులోని శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర ఆలయంలో ఈ నెల 21 నుంచి 25వ తేది వరకు శంకర జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడాలన్న సంకల్పంతో కేరళ రాష్ట్రం కాలడి గ్రామంలో ఆదిశంకరాచార్యులు జన్మించారని, అతి చిన్న వయసులోనే కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు నాలుగుసార్లు పాదయాత్ర చేసి శక్తివంతమైన పీఠాలు నిర్మించి ప్రజల్లో శాంతి సామరస్యం నెలకొల్పారని తెలిపారు.ఈ ఉత్సవాలకు భక్తులందరూ విచ్చేసి ఆ పరమేశ్వరుని కృపాకటాక్షాలు పొందాలని కోరుకుంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు మందలపు సాయిబాబా, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుకు సాయం

● తల్లిదండ్రులులేని చిన్నారులకు పటాన్‌చెరు సీఐ చేయూత
● స్నేహితుడి సహకారంతో ప్రతినెలా ఆర్థిక సాయం
● రుద్రారం ఎంఎస్ఎన్ కార్మికులు రూ.2.1 లక్షలు అందజేత



చిన్నారికి చెక్కును అందజేస్తున్న ఎంఎస్ఎన్ పరిశ్రమ హెచ్ఆర్ మూర్తి, సీఐ వేణుగోపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చదివిస్తూ కంటికి రెప్పలా కాపాడుతుంటారు. తల్లిదండ్రులు లేనివారు అమ్మమ్మలు, నానమ్మల వద్ద ఉంటూ చదువుకుంటారు. అయితే పరిస్థితులు అనుకూలించక ఆసక్తి ఉన్నా చదువుకు దూరం అవుతూ ఉంటారు కొందరు. ఇలాంటి కోవకు చెందిన ఐదుగురు పిల్లలను గుర్తించి, వారి కాళ్లమీద వాళ్లు నిలబడేలా 'వన్ ఛాలెంజ్' సంస్థ ద్వారా సహాయాన్ని అందిస్తున్నారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతవాసులకు సాయం చేయాలనే తలంపుతో దాతల ద్వారా ఈ చిన్నారులు చదువుకు పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి ఆర్థికసాయం అందిస్తున్నారు.

సొంత మండలంలో ఐదుగురు చిన్నారులు గుర్తింపు

నల్లగొండ జిల్లా నిడమానూరు మండలం ముకుందాపురానికి చెందిన లిఖిత, లావణ్య 14 ఏళ్ల లోపు చిన్నారుల తల్లి కొంతకాలం క్రితం కరోనాతో చనిపోయింది. తండ్రి దివ్యాంగుడు కావడంతో పిల్లల యోగక్షేమాలు చూడలేకపోయాడు. దీంతో వారు నానమ్మ వెంకట నర్సమ్మ వద్ద ఉంటున్నారు. వారి చదువు అంతంతగా ఉండటంతో ముందుసాగడం లేదు. బియ్యపల్లి గ్రామానికి చెందిన నేహా, వర్షిత్ తల్లిదండ్రులు చనిపోయారు. వారు కూడా నానమ్మ వద్దే ఉంటున్నారు. నిడమానూరు గ్రామానికి చెందిన కీర్తన(15) తల్లి పున్నెమ్మ చనిపోయింది. తండ్రి వెళ్లిపోవడంతో వారి మేనమామ వద్దే ఉంటోంది. గ్రామస్తులు, స్నేహితుల ద్వారా సమాచారం తెలుసుకున్న పటాన్‌చెరు సీఐ స్పందించారు. వారి చదువుకు 'వన్ ఛాలెంజ్' చేయూతతో ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చారు.

ముందుకు వచ్చిన దాతలు

'వన్ ఛాలెంజ్' ప్రేరణతో పటాన్‌చెరు మండలం ఎంఎస్ఎన్ పరిశ్రమ కార్మికులు ఏటా గణేష్ నవరాత్రులు నిర్వహిస్తారు. వీరు ఏర్పాటు చేసిన మండపంలో లడ్డూను వేలం వేసి వచ్చిన నగదుతో సేవా కార్యక్రమాలు చేయలదలిచారు. పటాన్‌చెరు సీఐ సేవాకార్యక్రమాలకు ప్రేరణతో వేలంలో వచ్చిన రూ.2.1 లక్షల నగదును డీడీ రూపంలో కార్మికులు ఈ ఐదుగురు చిన్నారులు చదువుకు పరిశ్రమ హెచ్ఆర్ మూర్తి ద్వారా బుధవారం అందజేశారు. మరో వ్యాపారవేత్త సాయి నలుగురి చిన్నారులకు రూ.2.4 లక్షలు, బాలికకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చారు.

బాగా చదువుకొని టీచర్‌ను అవుతా



మా అమ్మచనిపోవడంతో నాన్న మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి మేనమామ వద్ద ఉంటున్నా. మా ప్రాంతానికి చెందిన పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి చదువుకునేందుకు ఆర్థిక సాయం చేస్తానని రూ.70 వేలు ఇప్పించారు. బాగా చదివి సార్ పేరు నిలబెడతా.

-కీర్తన, 8వ తరగతి విద్యార్థిని

నానమ్మ వద్ద ఉంటున్నాం



గత ఏడాది కరోనాతో అమ్మ చనిపోయింది. నాన్న దివ్యాంగుడు. నానమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నాం. మా గురించి తెలుసుకొని సీఐ వేణుగోపాల్‌రెడ్డి రూ.70 వేలు ఇప్పించారు. నెలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు.

- లిఖిత, లావణ్య